సాక్షి
రంగారెడ్డి

బుధవారం । 21 । ఆగస్టు । 2024



కారులోవచ్చి దర్జాగా చోరీ

ఒకే రాత్రి ఐదు షాపుల్లో వరుస దొంగతనా లకు పాల్పడి.. సుమారు రూ.5 లక్షల నగదు దోచుకెళ్లారు. 8లో▸



విద్యార్థులకు తప్పిన ముప్పు

అతివేగంగా వెళ్లిన స్కూల్ బస్సు అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. విద్యార్థు లకు కొద్దిలో ప్రమాదం తప్పింది. 8లో▸



రెండు కార్లు ఢీ

రెండు కార్లు ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన ఆమనగల్లు మండలం కోనాపూర్‌గేటు వద్ద జరిగింది. 8లో▸

న్యూస్‌రీల్

రుణమాఫీపై ఆందోళన వద్దు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



మొయినాబాద్ రైతు వేదికలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ గీతారెడ్డి

మొయినాబాద్: రుణమాఫీపై రైతులు ఆందోళన అవసరం లేదని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మొయినాబాద్ రైతు వేదికలో మంగళవారం జరిగిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె రైతులతో మాట్లాడుతూ.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ రైతులందరికీ వస్తుందన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్నవారు.. పైన ఉన్న మొత్తాన్ని.. వడ్డీని బ్యాంకులకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణమాఫీ కానివారు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20 రోజుల పాటు గ్రామాల్లోకే అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఏఓలు రాగమ్మ, అనురాధ, ఏఈఓలు కుమార్, సునీల్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశ ప్రగతి

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత



నాటుకోళ్ల మదర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, అధికారులు

కేశంపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించినప్పుడే దేశం ప్రగతిపథంలో పయనిస్తుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని కాకునూరు, కొండారెడ్డిపల్లి గ్రామ శివారులోని ఇండుబ్రో పౌల్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్ నాటుకోళ్ల మదర్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె నాటుకోళ్ల పెంపకంలో తీసుకుంటున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ శ్రీలత మాట్లాడుతూ.. మహిళలు, యువత స్వయం ఉపాధిని ఎంచుకొని స్వశక్తితో ఎదగాలని అన్నారు. ప్రధానంగా మహిళలు స్వయం సంఘాల సహకారంతో అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రధానమంత్రి కుసుమ పథకం కింద సోలార్ యూనిట్ ఏర్పాటుకు కేశంపేట సబ్‌స్టేషన్‌లోని రెండు ఎకరాల భూమిని పరిశీలించారు. అనంతరం మానసిక పునరావాస కేంద్రం, కాకునూరులోని మెటెశ్రీను కోళ్ల ఫాంను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు అడిషనల్ డైరెక్టర్ సూర్యారావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు బాలరాజు, స్వర్ణలత, నరసింహ, మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఏఈ నర్సింగ్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక బల్దియాపైనే ఆమ్రపాలి దృష్టి

ఇతర విభాగాల బాధ్యతల నుంచి రిలీవ్

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఇకనుంచి జీహెచ్‌ఎంసీపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటి వరకు ఆమెకు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగానూ అదనపు బాధ్యతలున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో జీహెచ్‌ఎంసీపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారనే అభిప్రాయాలున్నాయి. తాజాగా ఆమెను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా నియమిస్తూ ఎంఆర్‌డీసీఎల్ ఎండీ, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఎండీగా బాధ్యతల నుంచి రిలీవ్ చేయడంతో రెగ్యులర్ కమిషనర్‌గా ఇక బల్దియాపై పట్టు సాధించనున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి దాకా పలు అంశాల్లో కొందరు అధికారులు ఆమ్రపాలిని తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇటీవల కొన్ని విభాగాల్లో బదిలీలు, శేరిలింగంపల్లి జోన్‌లో ఇంజినీర్ల కొట్లాటలో ఒక్కరిపైనే చర్యలు, తదితరమైనవి అందుకు ఊతమిచ్చాయి. ఏళ్ల తరబడి సీట్లకు అంటుకుపోయిన వారు కదలకపోవడం.. పేరుకు బదిలీ తప్ప కొందరు అదే ప్రాంతంలో కొనసాగుతుండటం వంటివి అందుకు దృష్టాంతాలు. ఇతర విభాగాల బాధ్యతలున్నందున జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల, అన్ని స్థాయిల అధికారులకు తగినంత సమయమిచ్చేందుకు వీలు కాలేదని చెబుతున్నారు.

రాఖీ పండుగ నేపథ్యంలో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. సోదరులకు రాఖీలు కట్టేందుకు వెళ్లడం.. వెళ్లినవారు తిరిగి వస్తుండడంతో సోమ, మంగళవారాలు బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతూ కనిపించాయి. బస్సుల కోసం బస్టాండ్లలో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది. సీట్లు ఖాళీగా లేకపోవడంతో చాలామంది నిలబడే ప్రయాణం చేశారు. చంటిపిల్లలతో ఇబ్బందులు పడ్డారు.



చేవెళ్ల బస్ స్టేషన్‌లో బస్సులకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

ఫుల్ రష్

కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు

- రాఖీ పండుగ నేపథ్యంలో రద్దీ
- కిటకిటలాడిన బస్టాండ్లు
- గంటల తరబడి నిరీక్షణ
- ప్రయాణికులకు తప్పని పాట్లు

చేవెళ్ల: స్థానిక బస్‌స్టేషన్ మీదుగా వచ్చి వెళ్లే బస్సుల్లో మంగళవారం ఖాళీ లేకుండా ప్రయాణికులతో నిండిపోయాయి. ఒకవైపు రాఖీ పండుగ కోసం వెళ్లి వస్తున్నవారు.. మరోవైపు విద్యార్థులు, ఉద్యోగులతో బస్సుల్లో ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఉండటంతో రద్దీ మరింత ఎక్కువైంది. చేవెళ్ల బస్‌స్టేషన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులకోసం చాలామంది నిరీక్షిస్తూ కనిపించారు. బస్సులు ఖాళీగా లేకపోవటంతో నిలబడి ప్రయాణం చేయాల్సి వచ్చింది. చిన్నపిల్లలతో ఇబ్బందులు పడుతూ వెళ్లారు.

రెండు రోజులు ఆదాయం



ఇబ్రహీంపట్నం: రాఖీ పర్వదినం సందర్భంగా ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. మహిళకు ఉచిత ప్రయాణంతో కలిపి డిపోకు ప్రతిరోజు సుమారు రూ.23 లక్షల నుంచి రూ.24 లక్షల ఆదాయం వచ్చేది. సోమ, మంగళవారాల్లో రోజుకు రూ.30 లక్షల చొప్పున రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. మహిళకు ఉచిత టికెట్లను తీసివేస్తే ఒకరోజు రూ.9 లక్షలు, మరో రోజు రూ.6 లక్షల చొప్పున నగదు ఆదాయం వచ్చింది. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది అన్నివిధాలా సహకారం అందించారు.

– వెంకటనర్సప్ప, డిపో మేనేజర్, ఇబ్రహీంపట్నం

నిలబడే ప్రయాణం..



రాఖీ కట్టేందుకు వెళ్లి తిరిగి వస్తున్నాం. సరిపడా బస్సులు లేక, వచ్చినవి ఖాళీ లేక షాద్‌నగర్ నుంచి చేవెళ్ల వరకు నిలబడే ప్రయాణం సాగించాం. సాయంత్రం కావటంతో విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువయ్యారు. అన్ని బస్సులు కిక్కిరిసి ఉన్నాయి.

– రమేశ్, కౌకుంట్ల, ప్రయాణికుడు

బస్సులు ఖాళీగా లేవు



రాఖీలు కట్టేందుకు కుటుంబసభ్యులతో కలిసి వెళ్తున్నాం. సోమవారం పండుగ కదా మంగళవారం తక్కువగా ఉంటారని అనుకున్నాం. అరగంటకు పైగా వేచి చూశాం. ఒక్కబస్సు కూడా ఖాళీ లేదు. పండుగల సమయంలో బస్సుల సంఖ్యను పెంచితే బాగుంటుంది.

– రాజు, ప్రయాణికుడు, రేగడిఘనాపూర్

❖ ఏ బస్సు చూసినా కిక్కిరిసి..



ఆమనగల్లులో బస్సు ఎక్కడానికి ఎగబడుతున్న ప్రయాణికులు

ఆమనగల్లు: ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఉన్న కొద్దిపాటి బస్సుల్లోనే ప్రయాణికులు ఎక్కుతుండటంతో నిత్యం కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ కిటకిటలాడిపోతున్నాయి. కనీసం నిలబడడానికి సైతం స్థలం ఉండడం లేదు. ఆమనగల్లు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రతిరోజూ పదుల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్–కల్వకుర్తి రూట్‌లో ప్రతి పది నిమిషాలకు ఓ బస్సు ఉన్నా ప్రయాణికులకు సరిపోవడం లేదు. సోమవారం రాఖీ పండుగ నేపథ్యంలో రెండురోజులు రద్దీ మరింత పెరిగింది. గ్రామీణ ప్రాంతాలకు సరిగా బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

బస్సులను పెంచాలి



ప్రస్తుతం నడుస్తున్న బస్సుల్లో ప్రయాణం ఇబ్బందిగా మారింది. ప్రతి బస్సు ప్రయాణికులతో నిండిపోతోంది. బస్సు ఎక్కాలన్నా.. దిగాలన్నా.. అవస్థలు తప్పడం లేదు. ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలి. అన్ని స్టేజీల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలి. ఆర్డినరీ బస్సులను పెంచాలి.

– సంగీత, ప్రయాణికురాలు, సాలార్‌పూర్

ఏ బస్సు చూసినా రద్దీ



బస్సుల్లో రద్దీతో ప్రతిరోజు నిలబడి ప్రయాణిస్తున్నాం. ఏ బస్సు చూసినా మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సుల సంఖ్యను పెంచాలి.

– నందకిశోర్, ప్రయాణికుడు, వెల్దండ

❖ పండుగ తాకిడి

షాద్‌నగర్: రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీకి ఆదాయం వచ్చినా ప్రయాణికులకు మాత్రం అవస్థలు తప్పలేదు. షాద్‌నగర్ డిపోలో 36 అద్దె బస్సులు, 50 ఆర్టీసీ బస్సులు మాత్రమే ఉన్నాయి. రాఖీ పండుగ రోజున బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, పరిగి తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు అధికంగా ఉన్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మాత్రమే అధికారులు బస్సులను అధికంగా నడిపించారు. దీంతో గ్రామీణ ప్రాంత వాసులు ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. పండుగ మరుసటి రోజు మంగళవారం కూడా బస్సుల్లో రద్దీ కొనసాగింది. డిపోలో సరిపోను బస్సులు లేకపోవడం, ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో అధికారులు హైదరాబాద్‌నుంచి అదనంగా ఆరు బస్సులను తెప్పించారు. అయినా అవి కూడా సరిపోక ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు.

అసౌకర్యం కలగకుండా చర్యలు



ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాం. రాఖీ పండుగ సందర్భంగా రద్దీ ఎక్కువగా ఉండటంతో అదనంగా హైదరాబాద్ నుండి తెప్పించి నడిపించాం. షాద్‌నగర్ డిపోకు రూ.26 లక్షల ఆదాయం వచ్చింది.

– ఉషారాణి, డిపో మేనేజర్, షాద్‌నగర్



షాద్‌నగర్ బస్టాండ్‌లో రద్దీ

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

షాద్‌నగర్: పర్యావరణ పరిరక్షణకు అందరూ తమవంతు కృషి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ (నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. 'అమ్మ కోసం ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రోజు రోజుకూ పర్యావరణం కాలుష్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. తద్వార రైతులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, భవిష్యత్తు తరాల వారికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని సూచించారు. ప్రకృతిని తల్లిగా భావించే సంస్కృతి భారతదేశంలోనే ఉందని, అందుకే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలంతా చెట్లు పెంచేలా ప్రోత్సహించేందుకు అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలంటూ ప్రధానమంత్రి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం, మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటి ఎరువు వేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ నాగేశ్వర్‌రావు

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం కావాలి



శిబిరంలో వైద్యులకు సలహాలు ఇస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

కొత్తూరు: సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు సూచించారు. మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. వ్యాధుల వ్యాప్తి నివారణకు అనుసరించాల్సిన చర్యలపై స్థానిక వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యతో పాటు పలు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్లు, రోడ్లపై వర్షపు నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి ఆవరణలో ఖాళీ కుండలు, కొబ్బరి బొండాల్లో నీరు ఉంటే దోమల వృద్ధి ఎక్కువగా ఉంటుందన్నారు. అలాంటి వాటిపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాల్లో గడ్డి పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు తరచూ ఫాగింగ్‌తో పాటు పలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే నిర్లక్ష్యం చేయకుండా పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమిక దశలో చికిత్స అందిస్తే సాధ్యమైనంత త్వరగా కోలుకుంటారని గ్రహించాలన్నారు. శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పకూలిన ఎల్బీస్టేడియం ప్రహరీ

గన్‌ఫౌండ్రీ: రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం ఎల్బీ స్టేడియం ప్రహరీ నేలకొరిగింది. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ పాత కార్యాలయానికి ఆనుకొని ఉన్న స్కేటింగ్ కోర్ట్ ప్రహరీ ఒక్కసారిగా కూలిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గోడకు ఆనుకుని ఉన్న ఓ భారీ వృక్షం సైతం గోడతో సహా ఒరిగి అక్కడే పార్క్ చేసి ఉన్న పోలీస్ వాహనాలపై పడింది. ఈ ఘటనలో ఓ వాహనం అద్దాలు పూర్తిగా ధ్వంసం కాగా మరో మూడు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. శిథిలాలను జీహెచ్‌ఎంసీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం తొలగించింది.



గోడ కూలి ధ్వంసమైన వాహనాలు



ఘటం ఊరేగింపులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేఎల్‌ఆర్ తదితరులు

సూర్యగిరి ఎల్లమ్మ సన్నిధిలో ప్రముఖులు



పూజలు చేస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్, బీజేపీ నేతలు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, మున్సిపల్ చైర్మన్ కాంటేకర్ మధుమోహన్, బడంగ్‌పేట మేయర్ పారిజాత, కమిషనర్ బి.వెంకట్రామ్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. వచ్చిన ప్రముఖులకు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం స్వాగతం పలికి సన్మానించారు.

దంచికొట్టింది

వర్షం ఒక్కసారిగా దంచి కొట్టింది.. మంగళవారం వేకువజామున జిల్లాలోని పలు ప్రాంతాల్లో కుండపోతగా కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు ఏరులై పారాయి. రోడ్లపైకి చేరిన వర్షపు నీటితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



కందుకూరు: జైత్వారంలో నిండుకుండలా నాయినివాని చెరువు



ఇబ్రహీంపట్నం: బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మీర్‌పేట: భారీ వర్షానికి ముంపునకు గురైన మిథులానగర్

బాలుడి అదృశ్యం



శ్రీకాంత్(ఫైల్)

చేవెళ్ల: రోజుమాదిరిగానే రాత్రి అందరితో పాటు నిద్రించిన 13 ఏళ్ల బాలుడు తెల్లవారుజామున తండ్రి లేచి చూసే వరకు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన కాజమోని నర్సింలు కుటుంబీకులు బతుకు దెరువు నిమిత్తం వలస వచ్చి స్థానిక భగత్‌సింగ్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఆయన కుమారుడు కె.శ్రీకాంత్(13) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. రోజుమాదిరిగానే సోమవారం అందరితో కలిసి పడుకున్నాడు. తెల్లవారు జామున 5గంటల ప్రాంతంలో నర్సింలు లేచి చూసే వరకు శ్రీకాంత్ కనిపించ లేదు. బాలుడి ఆచూకీ కోసం తండ్రి ఎక్కడ వెతికినా లభించలేదు. దీంతో ఆయన మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది. బాలుడు గుండ్రటి ముఖం, నాలుగు అడుగుల పొడవు, గోధమరంగు చొక్కా ధరించాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు చేవెళ్ల పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మతిస్థిమితం సరిగాలేని బాలుడు



సాయి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: మతిస్థిమితం సరిగాలేని బాలుడు అదృశ్యమైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం. కప్పపహాడ్ గ్రామానికి చెందిన వెంకటేశ్ కుమారుడు సాయి(16)కి మతిస్థిమితం సరిగాలేదు. ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జలమండలి ఈడీగా మయాంక్ మిట్టల్

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా మయాంక్ మిట్టల్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం నారాయణపేట అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న 2020 బ్యాచ్ ఐఏఎస్ అధికారి మయాంక్ మిట్టల్‌ను జలమండలికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జలమండలిలో సుదీర్ఘ కాలంగా ఈడీగా కొనసాగిన సత్యనారాయణ ఇటీవల మూసీ రివర్ ఫ్రంట్ శాఖకు బదిలీ అయిన విషయం విదితమే.

కారులో వచ్చి దర్జాగా చోరీ

- ఒకే రాత్రి ఐదు దుకాణాల్లో దొంగతనం
- రూ.5 లక్షల నగదు అపహరణ
- ఇనుప రాడ్లతో షటర్లు పైకెత్తిన దుండగులు
- నిమిషాల వ్యవధిలో టాస్క్ పూర్తి



దుండగులు ధ్వంసం చేసిన జీఆర్ మొబైల్ దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



దుకాణంలోనికి ప్రవేశించిన దుండగుడి సీసీ పుటేజీ



షాబాద్: బాలాజీ మొబైల్ షాప్ పరిశీలిస్తున్న పోలీసులు



మొయినాబాద్: దుండగులు ధ్వంసం చేసిన హార్డ్‌వేర్ షటర్లు

షాద్‌నగర్ రూరల్: దర్జాగా కారులో వచ్చారు.. షాపులకు అడ్డంగా కారును పార్క్ చేశారు. ఎవరూ గుర్తు పట్టకుండా తలకు టోపీ, ముఖానికి కర్చీఫ్ ధరించారు. ఇనుప రాడ్లతో దుకాణాల షట్టర్లను పైకెత్తి లోపలికి ప్రవేశించారు. షాపుల్లోని వస్తువులను ముట్టుకోకుండా కేవలం డబ్బులు మాత్రమే ఎత్తుకెళ్లారు. ఇలా ఒకే రాత్రి ఐదు షాపుల్లో వరుస దొంగతనాలకు పాల్పడి.. సుమారు రూ.5 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ దృశ్యాలన్నీ సీసీ టీవీలో రికార్డయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మొదట పట్టణంలోని జీఆర్ మొబైల్స్‌లోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి కేవలం నిమిషం వ్యవధిలోనే తన చేతి వాటాన్ని ప్రదర్శించి రూ.1.65 లక్షలు దోచుకుని బయటకు వెళ్లారు. అనంతరం కేకే ఎలక్ట్రానిక్స్‌లో రూ.1.50 లక్షలు చోరీచేశారు. ఆతర్వాత నేషనల్ మార్ట్‌లో చోరీకి యత్నించినా డబ్బులు దొరకకపోవడంతో ఓ దొంగ తను ధరించిన పాత దుస్తులను వదిలేసి, షాపులోని కొత్త డ్రెస్ వేసుకెళ్లాడు. అక్కడి నుంచి లక్ష్మీవెంకటేశ్వర ట్రేడర్స్‌లో సిగరెట్ ప్యాకెట్ల కాటన్‌ను ఎత్తుకెళ్లారు. మిగతా షాపుల్లో వస్తువులను ముట్టుకోకుండా కేవలం నగదు మాత్రమే దొంగిలించారు. ఇందులో నలుగురు వ్యక్తులు పాల్గొని ఉండవచ్చని తెలుస్తోంది.

ప్రారంభించిన రాత్రే చోరీ

పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వోల్టాస్ ఎలక్ట్రానిక్స్ షాపును సోమవారం ప్రారంభించారు. షాపు యజమాని రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి షాపులో చోరీ జరిగింది. కౌంటర్‌లోని సుమారు రూ.1.45 వేలు దోచుకెళ్లారు.

ఆనవాళ్లు దొరకకుండా

పట్టణంలో ఒకే రోజు దోపిడీలకు పాల్పడిన దొంగలు తమ ఆనవాళ్లు దొరకకుండా ఉండేందుకు జాగ్రత్త పడ్డారు. సీసీ కెమెరాలలో తమను ఎవరూ గుర్తు పట్టకుండా నెత్తికి టోపీ ధరించి, ముఖానికి చేతిరుమాలు కట్టుకున్నారు. చోరీ చేసిన తర్వాత షటర్లు, కౌంటర్లపై వేలిముద్రలు దొరకకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

దర్యాప్తు చేపట్టిన పోలీసులు

పట్టణంలో వరుస దొంగతనాలు జరిగిన విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆయా దుకాణాలకు చేరుకొని పరిశీలించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి ఫింగర్ ప్రింట్స్‌తో పాటుగా ఆధారాలను సేకరించారు. ఈ వరుస దోపిడీలలో ఎంతమంది పాల్గొన్నారు.. చోరీ తర్వాత ఎటు వైపు వెళ్లారు అనే విషయాలపై విచారణ చేస్తున్నారు.

నలుగురు వ్యక్తులు.. మూడు చోరీలు

షాబాద్: గుర్తు తెలియని దుండగులు మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఓ వాహనంలో వచ్చి బాలాజీ మొబైల్స్, శ్రీ వినాయక మొబైల్స్, శ్రీకృష్ణ సూపర్ మార్కెట్‌లో దొంగతనానికి పాల్పడ్డారు. మూడు దుకాణాల్లో కలిపి సుమారు రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లారు. చేవెళ్ల ఏసీపీ కిషన్, క్రైమ్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, సీఐ కాంతారెడ్డి, ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఫింగర్ ప్రింట్ వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

హార్డ్‌వేర్ దుకాణంలో..

మొయినాబాద్: అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఓ హార్డ్‌వేర్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌తో పాటుగా నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. హిమాయనగర్ రెవెన్యూ స్వామినారాయణ గురుకుల్ ఎదుట జై శ్రీ ఆశాపుర ఎంటర్‌ప్రైజెస్ పెయింట్, నేషనల్ ప్లైవుడ్ హార్డ్‌వేర్ దుకాణం ఉంది. నిర్వాహకులు రోజు మాదిరిగానే సోమవారం రాత్రి తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు షాపు షటర్లు ధ్వంసం చేసి లోపలికెళ్లారు. కౌంటర్‌లో ఉన్న రూ.2వేల నగదు, సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం షాపు యజమానులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. క్లూస్ టీం అక్కడకు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు కార్లు ఢీ



నుజ్జునుజ్జయిన వాహనం

ఆమనగల్లు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మండల పరిధి కోనాపూర్‌గేటు హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్తున్న కారు.. కోనాపూర్ గేటు వద్ద ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో నరేశ్‌యాదవ్‌కు తీవ్ర గాయాలవ్వగా.. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. నరేశ్‌ను చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని ఆమనగల్లు పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు.

రైలు పట్టాలపై యువకుడి ఆత్మహత్య



ఖాజా పాషా(ఫైల్)

నందిగామ: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నందిగామ పంచాయతీ పరిధిలోని చంద్రయాన్‌గూడ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. నందిగామకు చెందిన ఖాజాపాషా(22) చంద్రాయన్‌గూడ సమీపంలో రైలు పట్టాలపై తలను పెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతని తల, మొండేం వేర్వేరుగా పడిపోయాయి. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ మాస్టర్ అఖిలేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

బయోగ్యాస్ టెక్నాలజీపై సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, సహజ వనరుల కొరత, స్వచ్ఛమైన ఎనర్జీ కోసం డిమాండ్ పెరుగుతుండటం వంటి సమస్యలకు బయోగ్యాస్ చక్కటి పరిష్కారం అని చెప్పొచ్చు. వ్యర్థ పదార్థాల నిర్వహణ వ్యవస్థలో బయో గ్యాస్ సాంకేతిక కీలక పాత్ర పోషిస్తుందని పలు రంగాలకు చెందిన నిపుణులు అభిప్రాయపడ్డారు. ఇటీవల హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో బయో గ్యాస్ టెక్నాలజీపై రెండు రోజుల పాటు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బయోగ్యాస్ పరిశ్రమ, పాలసీ రూపకర్తలు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. రెజీలియెన్స్ టువార్డ్స్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఎనర్జీ సెక్యూరిటీ అనే అంశంపై నిపుణులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐఆర్–ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, వీవీఎస్ కిశోర్, వీణా జోషి, ఎస్ఎన్ శ్రీనివాస్, రాజేశ్వరి, పి.రమణ్, రమణారెడ్డి, గంగాగ్ని రావు తదితరులు ఈ చర్చలో పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం

చిక్కడపల్లి: వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఓ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతయ్య కథనం ప్రకారం... బిహార్ రాష్ట్రానికి చెందిన నిఖిల్ కుమార్(22) రాంనగర్‌లోని పయనీర్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం రాంనగర్ చౌరస్తానుంచి వీఎస్టీ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో నిఖిల్ కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: జల్‌పల్లి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు జూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌ల్లి పెద్ద చెరువులో వాదే ముస్తాఫా ఈద్గా సమీపం వైపు మంగళవారం శవం తేలియాడుతున్న విషయమై సమాచార ం అందింది. ఈ మేరకు పహాడీషరీఫ్ పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మృతుడి వ యసు 50–60 ఏళ్ల మధ్య ఉంటుందని, మొ లత్రాడును బట్టి హిందువుగా భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిన స్థితిని చూసి ఐదారు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యను హత్య చేసిన వ్యక్తికి రిమాండ్

షాద్‌నగర్ రూరల్: భార్య హత్య కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం మంగళవారం అతన్ని రిమాండ్‌కు తరలించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మల్లికార్జున కాలనీలో నివాసం ఉంటున్న జూనియర్ ఆర్టిస్టు మద్దూరి అనురాధ హత్యకు గురైన విషయం విదితమే. ఈ ఘటనలో పరారీలో ఉన్న భర్త శివరామయ్యను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, పరారీలో ఉన్న నిందితున్ని పట్టుకున్నారు. భార్య అక్రమ సంబంధం నేపథ్యంలోనే ఆమెను హత్య చేసినట్లు శివరామకృష్ణ ఒప్పుకొన్నాడని సమాచారం. అనంతరం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

లైక్‌ల కోసం విన్యాసాలు.. ఆకతాయిల రిమాండ్

సంతోష్‌నగర్: సోషల్ మీడియాలో లైక్‌ల కోసం బుర్ఖా ధరించి ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేస్తున్న ఆకతాయిలను ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్ చమాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అహ్మద్ అలియాస్ దానిష్ (18), మహ్మద్ అబ్దుల్ వాసిఫ్ అలియాస్ సైఫ్ (18), తలాబ్‌కట్టా అమన్‌నగర్–బి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ అమన్ హుస్సేన్ (23) ప్రజలను ఆట పట్టించేందుకు, సోషల్ మీడియాలో లైక్‌లు వచ్చేందుకు ఈ నెల 15వ తేదీన బుర్ఖా ధరించి..బైకుపై స్టంట్లు చేశారు. వీటిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనిపై సుమోటోగా కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు తప్పిన ముప్పు

- పొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఘటన



మొత్కుపల్లి మార్గంలో రోడ్డు కిందికి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

మొయినాబాద్: అతివేగంగా వెళ్లిన స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు కింద ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన మండల పరిధిలోని మొత్కుపల్లి రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. చిలుకూరులోని శివసాయి ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు ఉదయం చిన్నమంగళారం, మొత్కుపల్లి గ్రామాల్లో సుమారు 20 మంది విద్యార్థులను ఎక్కించుకుని బయల్దేరింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా బస్సు నడపడంతో మొత్కుపల్లి శివారు దాటగానే అదుపు తప్పి, చెట్ల పొదల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బస్సు ఇంకాస్త ముందుకు వెళ్లి ఉంటే ప్రీకాస్ట్ గోడ ను, చెట్టును ఢీకొట్టేది. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని విద్యార్థులను కిందికి దింపారు. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందన్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంతో ఈ ఘటన జరిగిందని తల్లిదండ్రులు, స్థానికులు మండిపడ్డారు. అనుభవజ్ఞులైన వారినే డ్రైవర్లుగా నియమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరగా ప్రమాదవశాత్తు బస్సు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయిందని.. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

అత్తింటి వేధింపులకు గృహిణి బలవన్మరణం



సువర్ణ(ఫైల్)


కందుకూరు: భర్తతో పాటు అత్త ఇంటి వేధింపులు తాళలేక ఓ గృహిణి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీతారామ్ తెలిపిన ప్రకారం .. మండల పరిధిలోని మాదాపూర్‌కు చెందిన మంద శ్రీనివాస్‌కు ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల గ్రామానికి చెందిన సువర్ణ(33)తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. శ్రీనివాస్ డ్రైవర్‌గా, సువర్ణ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భర్త ఏడాది నుంచి మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని తరచూ భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం మరోమారు గొడవపడగా.. మనస్తాపానికి గురైన సువర్ణ అర్ధరాత్రి ఇంట్లోని సీలింగ్ రాడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి పుట్టింటి వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, ఆయన తల్లిదండ్రులు, తమ్ముడు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పరమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



'రామ్‌రాజ్' షోరూం ప్రారంభం శంషాబాద్‌లో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ప్రారంభించింది. టీఎస్ఆర్ ఫార్మా, అలెంబిక్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మేనేజింగ్ డైరెక్టర్ గుండు ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు.

మంచి నీటి కనెక్షన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్

- జలమండలి మేనేజర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అరెస్టు
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు చిక్కిన జలమండలి మేనేజర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి

మణికొండ: మంచినీటి కనెక్షన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేసి వసూలు చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగితో పాటు జలమండలి మేనేజర్‌ను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. మణికొండ జలమండలి డివిజన్–18లో మేనేజర్‌గా పనిచేస్తున్న స్ఫూర్తి రెడ్డితో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్‌ను వలపన్ని పట్టుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వేంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉపేంద్రనాథ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం దాడులు చేసి వారిని అరెస్టు చేశారు. తన అపార్ట్‌మెంట్‌కు రెండు నీటి కనెక్షన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా పట్టించుకోకపోవటంతో ఉపేంద్రనాథ్‌రెడ్డి జలమండలి కార్యాలయానికి వచ్చి మేనేజర్ స్ఫూర్తిరెడ్డిని కలిశాడు. ఆమె సమాధానం చెప్పకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నవీన్‌గౌడ్‌ను కలవాలని సూచించింది. అతన్ని కలవగా ఒక్కో కనెక్షన్‌కు రూ.15 వేల చొప్పున రూ.30 వేలు ఇస్తే మీ పని అయిపోతుందని సలహా ఇచ్చారు. దాంతో అతను ఏసీబీని ఆశ్రయించి మంగళవారం వారి సూచన మేరకు మణికొండ మర్రిచెట్టు సర్కిల్‌లో ఉన్న జలమండలి కార్యాలయం వద్ద నవీన్‌గౌడ్‌కు డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు అతన్ని అరెస్టు చేశారు. విచారణలో మేనేజర్ ఆదేశం మేరకే డబ్బు తీసుకున్నానని పేర్కొనటంతో ఆమెను కూడా అరెస్టు చేశారు. వసూలు చేసిన మొత్తంలో మేనేజర్‌తో పాటు డీజీఎం, జీఎంలకు వాటా ఇవ్వాల్సి ఉందని ఏసీబీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో నవీన్‌గౌడ్ అంగీకరించాడు. దాంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. దాడులలో ఏసీబీ సీఐలు ఆజాద్, జగన్మోహన్‌రెడ్డి, నవీన్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవం

చేవెళ్ల: ప్రజల కోసం పనిచేసే వారు ప్రజల మనస్సుల్లో గుర్తుండిపోతారని సినీ నటుడు డాక్టర్ మోహన్‌బాబు అన్నారు. మండల పరిధిలోని కొకుంట్ల చౌరస్తాలో చేవెళ్ల మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.బాల్‌రాజ్ ఆయన కుమారులు యాదగిరి, వెంకటేశ్‌లు ఏర్పాటు చేసిన ఎంబీఆర్ కన్వెన్షన్ హాల్‌ను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కన్వెన్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, సినీ నటుడు మోహన్‌బాబు